

254 పశువులకు 'గాలికుంటు' టీకాలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

మండలంలోని భీమ క్రోసు పాలెం గ్రామంలో వెల్ల పశు వైద్యాధికారి ఏర్పాటు చేసిన ఉచిత గాలి కుంటి వ్యాధి టీకాలు కార్యక్రమంలో 254 పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్ పలివెల లోవరాజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యానిమల్ హస్బండ్రీ అసిస్టెంట్స్ డైరెక్టర్ రామకృష్ణ, పశు వైద్యులు గోపాలమిత్రలు పాల్గొన్నారు. భీమ క్రోసుపాలెం పరిసర ప్రాంతాల రైతులు హాజరయ్యారు.



భీమక్రోస్‌పాలెంలో గాలికుంటు టీకాలు వేస్తున్న పశువైద్యులు

తాగునీరందించడమే లక్ష్యం

▸ మంత్రి పినిపే విశ్వరూప్

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

జల జీవన్ మిషన్ పథకం ద్వారా 2024 చివరి నాటికి అన్ని గ్రామీణ గృహాలకు స్వచ్ఛమైన, తగినంత మొత్తంలో తాగు నీటిని సరఫరా చేయాలనేదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. గురువారం స్థానిక మండల పరిధిలోని పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.

తొలుతగా ఇందుపల్లి గ్రామంలో పంచాయతీరాజ్ విభాగం ద్వారా నరేగా నిధులైన రూ.35 లక్షల అంచనా వ్యయం తో నిర్మించిన గ్రామ సచివాలయం-1 భవనాన్ని మంత్రి, శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ ప్రారంభించారు. అనంతరం అదే గ్రామంలో జల జీవన్ మిషన్ నిధులైన రూ.31.30 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. తదుపరి అదే గ్రామంలో నరేగా నిధులైన రూ.23.94 లక్షల అంచనా వ్యయం తో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం-1 ను వారు ప్రారంభించారు. సాకుర్రు గ్రామంలో జలజీవన్ మిషన్ నిధులైన రూ.25.50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన శిలాఫలకాన్ని వారు ఆవిష్కరించారు. అదే గ్రామంలో పంచాయతీరాజ్ ఇంజినీర్ విభాగం ఆధ్వర్యంలో నరేగా, గడప..గడపకూ మన ప్రభుత్వం నిధులైన రూ .46.60 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని వారు ప్రారంభించారు. అదే గ్రామంలో ఎంపిపి నిధులైన రూ.3 లక్షల అంచనా వేయంలో నిర్మించిన మినీ కమ్యూనిటీ హాలును వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జలజీవన్‌మిషన్ పథకంలో నీటిని రీఛార్జ్ చేయడం, పునర్వినియోగం, వాటర్ మేనేజ్మెంట్, వర్షపు నీటి సేకరణ వంటి నీటి సంరక్షణ ప్రతి ఇంటికి కుళాయిల ద్వారా నీటి సరఫరా కార్యక్రమాలు ముఖ్యాంశాలన్నారు. సురక్షిత తాగు నీటిని అందించడం ద్వారా జీవన సామర్థ్యాన్ని అభివద్ధి పర్చడం ,జీవన నాణ్యతను పెంపొందించే లక్ష్యంతో ఈ పథకం ఆవిర్భవించిందన్నారు.ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ మంజూరు చేయడంతో పాటుగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, పంచాయతీ భవనాలు, కమ్యూనిటీ నిర్మాణాలు, వెల్నెస్ కేంద్రాలకు సురక్షిత త్రాగునీటి సరఫరాను అనుసంధానించడం జరుగుతోందన్నారు. నీటి సరఫరాలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ఈ పథకం అమలవుతోందన్నారు. కార్యక్రమాల్లో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దంగేటి డోలామణి రుద్ర, వైస్ ఎంపిపి పాలమూరు బాలకష్ణ, జెడ్‌పిటిసి సభ్యుడు పందిరి శ్రీహరి రామ్ గోపాల్, మండల అధ్యక్షులు బొంతు గోవింద శెట్టి, ఎస్‌సి సెల్ కార్యదర్శి వెంకటేష్, ఎంపిటిసి శ్రీరామచంద్ర మూర్తి, సర్పంచులు గుత్తుల చిరంజీవి రావు, చొల్లంగి శివాలిని అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.



మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్న మంత్రి విశ్వరూప్ తదితరులు

వైఎస్ షర్మిల అరెస్ట్‌పై సిపిఎం ఖండన

ప్రజాశక్తి-అమలాపురం

రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సి ప్రకటించాలని కోరుతూ ప్రశాంతంగా ఆందోళన చేస్తున్న పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలని అరెస్టు చేయడాన్ని సిపిఎం డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా కమిటి ఖండిస్తోందని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెగా డిఎస్‌సి విడుదల చేయాలని నిరసన తెలియజేయడానికి చలో విజయవాడకు కార్యకర్తలు రాకుండా ముందస్తు అరెస్టులు చేయడం జిల్లాలో కూడా నాయకులను అరెస్టులు చేయడాన్ని ఆయన ఖండించారు. నిరంకుశ వైసిపి ప్రభుత్వం యొక్క నైజం వెల్లడవుతోందని అన్నారు.

ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్‌సి ప్రకటించి నిరుద్యోగులకు ఊరట కల్గించాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఎన్నికలు ముందు ఇచ్చిన హామీని మర్చి పోయి మెగా డిఎస్‌సి కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులను జగన్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. సిఎం జగన్ తగిన మూల్యం చెల్లించక తప్పదని కారెం వెంకటేశ్వరరావు అన్నారు.

కాంగ్రెస్ నాయకుల హౌస్ అరెస్ట్

ప్రజాశక్తి - అంబాజీపేట

కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో సెక్రటేరియట్ కార్యక్రమానికి చలో సెక్రటేరియట్ కార్యక్రమాన్ని అడ్డుకున్న జగన్ ప్రభుత్వం చర్యలను గురువారం అంబాజీపేట కాంగ్రెస్ శ్రేణులు ఖండించారు. నాయకులను హౌస్ అరెస్టు చేయడం ను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎపిసిసి జనరల్ సెక్రటరీ మహమ్మద్ ఆరిఫ్, మండల శాఖ అధ్యక్షులు నెల్లి వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శి ఆదుర్తి నారాయణమూర్తి, జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇస్మాయిల్ అన్నారు.



కాంగ్రెస్ నాయకులను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

వెయిట్ లిఫ్టింగ్ ట్రోఫీల ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమలాపురం

స్థానిక డాక్టర్ మెట్ల సత్యనారాయణ రావు ఆరోగ్య ఉద్యానవనం నందు మున్సిపల్ 2వ వార్డ్ కౌన్సిలర్ ఆశెట్టి నాగ దుర్గ నేతృత్వంలో ఈనెల 25న తొలి ఉభయగోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్, బెంజ్ ప్రెస్ 2024 పోటీల ఛాంపియన్‌షిప్ ట్రోఫీల ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం అమలాపురంలోని హెల్త్ అండ్ ఫిట్నెస్ జిమ్ లో ఈ కార్యక్రమం నిర్వహించారు .అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు యెనుముల కృష్ణ పద్మరాజు, వంటెద్దు వెంకన్న నాయుడు సంయుక్త అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఛాంపియన్‌షిప్ ట్రోఫీల ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో కోచ్ కంకిపాటి వెంకటేశ్వర రావు, జిమ్ సభ్యులు పాల్గొన్నారు.



ట్రోఫీలు ఆవిష్కరిస్తున్న జిమ్ సభ్యులు

నేడు ఇంటర్ ప్రథమ సంవత్సర పర్యావరణ విద్య పరీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

అనివార్య కారణాల మూలంగా ఈనెల మూడో తేదీన నిర్వహించాల్సిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర పర్యావరణ విద్య పరీక్ష వాయిదా పడిందని జిల్లా ఇంట ర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వి. సోమశేఖర రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా పడిన ఈ పరీక్ష ఈ నెల 23వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తారన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు తమకు కేటాయించిన పరీక్షా కేంద్రాలకు వెళ్లి పర్యావరణ విద్య పరీక్షకు హాజరు కావలసింది గా ఆయన ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

సమస్యలు పరిష్కరించాలని గోపాల మిత్రల ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ వద్ద గోపాలమిత్ర ఉద్యోగులు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. ఈ ధర్నాని ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి నూకల బలరాం, గోపాలమిత్ర ఉద్యోగుల యూనియన్ ప్రెసిడెంట్ రత్నరాజు మాట్లాడుతూ సిఎం జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. గోపాల మిత్రులకు ఇస్తున్న జీతం రూ.6500తో కుటుంబాలను పోషించుకోవడం చాలా కష్టతరం అని, నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగినాయి అని ధరలను దష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వెంటనే వీరికి కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో చనిపోయిన వారికి గతంలో మాదిరిగా ఎక్స్‌గ్రేషన్ ఇవ్వాలని, గోపాల మిత్రులకు 2019 నుంచి రావాల్సిన ఇన్సెంటివ్‌లు చెల్లించాలని డిమాండ్ చేశారు. డ్యూటీలో ఉండగా యాక్సిడెంట్ లో చని పోయిన శివశంకర్ కుటుం బాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ కి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాకు ఐద్వా నాయకురాలు వరలక్ష్మి మద్దతు తెలియజేశారు. ఈ ధర్నా లో గోపాల మిత్ర నాయకులు రాజ్, శ్రీనివాసరావు, సత్యనారాయణ, సంటి బాబు, ప్రకాష్ రావు,గోవింద్ గోపాల మిత్ర ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న గోపాల మిత్రలు



మాట్లాడుతున్న ఎస్ఐ సురేంద్ర

ఓటర్లకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-రామచంద్రపురం

వెంకటాయపాలెం గ్రామంలో గురువారం ఓటర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ద్రాక్షారామ ఎస్ఐ సురేంద్ర మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి ఓటర్లు సరైన అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామ సర్పంచ్ యల్లమెల్లి సతీష్ కుమారి మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వార్డు సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

వెంకన్న హుండీ ఆదాయం రూ.91 లక్షలు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం ఆలయ వసంత మండపంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. జిల్లా దేవాదయశాఖ అధికారి మరియు అసిస్టెంట్ కమిషనర్ డి. నాగమల్లేశ్వరరావు, మరియు పొడగట్లపల్లి ఉప్పలపాటి జానకమ్మ అన్నదాన సత్రం కార్య నిర్వహణ అధికారి ఎం రాధాకష్ణ పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. 29 రోజులకు రూ.91 లక్షల 5 వేల 373 తో పాటు 57 గ్రాముల బంగారం, 9 వందల గ్రాములు వెండితోపాటు పలు దేశాల విదేశీ కరెన్సీ లభించింది. అలాగే ఆలయ ప్రాంగణంలో ఉన్న క్షేత్రపాలకుడు విశ్వేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.1లక్షా 55 వేల 674 సమకూరాలని ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్ తెలిపారు ఈ కార్యక్రమంలో చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు ధర్మకర్త మండలి సభ్యులు శనగల సత్య నారాయణ , మన్యం భాను, సర్పంచ్ పోచి రాజు బాబురావు తదితరులు పాల్గొన్నారు.

కాపునాడు మండల అధ్యక్షునిగా తాతాజీ

ప్రజాశక్తి -మామిడికుదురు.

కాపునాడు మండల శాఖ అధ్యక్షులుగా గుండబత్తుల గోవిందరావు (తాతాజీ)ని నియమిస్తూ గురువారం రాష్ట్ర వర్కింగ్ పెసిడెంట్ అబ్బిరెడ్డి సురేస్ నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ కాపుల అభ్యున్నతిక కృషి చేస్తామన్నారు. తన నియామకానికి కృషి చేసిన పి.గన్నవరం నియోజకవర్గం ఇంచార్జి తోట శ్రీనివాసరావు తదితరులకు ధన్యవాదాలు తెలిపారు.

ఆసరా నాలుగో విడత చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని ఏడిద గ్రామంలో వైఎస్ఆర్ ఆసరా నాలుగవ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం గ్రామ సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన గురువారం జరిగింది.కార్యక్రమానికి ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు, జెడ్‌పిటిసి సభ్యురాలు కురుపూడి భవాని, ఎంపిపి ఉండమట్ల శ్రీనివాసు, వైస్ ఎంపిపి పసుమర్తి నాగబాబు, సీతానగరం సర్పంచ్ వరద చక్రవర్తి, వైసిపి గ్రామ కన్వినర్ పలివెల సుధాకర్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి తోట మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల హామీ అయిన డ్వాక్రా రుణ మాఫీ చేయలేదన్నారు. అనంతరం ఏడిద, ఏడిద సీతానగరం గ్రామాలలోని 359 స్వయం సహాయక సంఘాలకు రూ.3 కోట్ల చెక్కును అందజేశారు. 5 సంవత్సరాలలో మొత్తం 4 విడతలకుగాను రూ.12 కోట్లు అక్క చెల్లమ్మలకు లబ్ది చేకూరిందని తెలిపారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ మెంబర్ చిలుకూరి బుజ్జి, ఎంపిటిసి సభ్యులు, సొసైటి ఛైర్మెన్ రామిసెట్టి శ్రీహరిబాబు, మండల అభివద్ధి అధికారి కె.శీదేవి, విస్తరణ అధికారి ఐదం రాజు, పంచాయతీ కార్యదర్శి యు.వీర్రాజు, డ్వాక్రా సిసి రవిరాజు, డ్వాక్రా యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ఎంఎల్‌సి తోట

కార్పొరేట్ వైద్యం అందించడమే ధ్యేయం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే ధ్యేయంగా నవభారత్ గ్రామీణ అభివద్ధి చారిటబుల్ ట్రస్ట్ పనిచేస్తుందని ఆ ట్రస్ట్ ఛైర్మన్ అంగాడి రేవతి పేర్కొన్నారు. కొమరగిరి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రామారావు పేట గ్రామంలో ఇమ్మాను యేలు ప్రేయర్ ఫెల్లోషిప్ చర్చి వద్ద నవభారత్ గ్రామీణ అభివద్ధి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిభిరం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్మన్ అంగాడి రేవతి విలేకర్లతో మాట్లాడుతూ సమాజంలో అనేకమంది నాణ్యమైన వైద్యం అందక, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లక ఇబ్బందులకు గురౌతున్నారని అన్నారు. వైద్యంతో పాటుగా విద్యను కూడా ఉచితంగా అందినప్పుడే సమాజంలో అసమానతలు తొలగిపోతాయని పేర్కొన్నారు. ఈ వైద్య శిబరంలో 800మంది గ్రామస్తులు పాల్గొన్నారని, అవసరమైనవారికి ఉచిత మందులు పంపిణి చేశారు. ఈ శిబిరంలో జనరల్ విభాగానికి చెందిన డాక్టర్ ఎం.ఫణి రమణ భూషణ్, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ పి.సూర్య ప్రకాష్ నాయుడు, గైనకాలజిస్ట్ డాక్టర్ బి.విజయ దుర్గాదేవి, కార్డియాలజిస్ట్ డాక్టర్ వి.సురేశ్వర్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ కె.లక్ష్మి వైద్య సేవలు అందించారు. చారిటబుల్ ట్రస్ట్ టీం సభ్యులు, గ్రామ ప్రజలు, గ్రామ యువకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నవభారత్ ట్రస్టు ఛైర్మన్ రేవతి

వైసిపికి బిసి నాయకుల రాజీనామా

ప్రజాశక్తి-అంబాజీపేట

పి.గన్నవరం నియోజవర్గ వైయస్సార్ సిపి ఇన్ చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు సమన్వయ లోపంతో పార్టీకి రాజీనామా చేసినట్లు మండల బిసి నాయకులు గురువారం ప్రకటించారు. గంగలకుర్రులో ఏర్పాటు చేసిన వైసిపి బిసి నాయకుల సమావేశంలో మండల వైసిపి మాజీ అధ్యక్షులు వాసంశెట్టి చినబాబు మాట్లాడుతూ తన పదవికి రాజీనామా చేసినా ఇంతవరకు పిలిచి మాట్లాడకపోవడం విప్పర్తి వ్యవహార శైలి నచ్చక రాజీనామా చేశామన్నారు. రాజీనామా చేసినవారిలో ముక్కామల సొసైటీ ఛైర్‌పర్సన్‌లు మట్టపర్తి చంద్రశేఖర్, వాసంశెట్టి రాంబాబు, ఇటికాలమ్మ దేవస్థానం ఛైర్మన్ చప్పిడి వెంకట సుబ్రహ్మణ్యం, మట్టపర్తి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి శ్రీనుబాబు, తదితరులు పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేశామన్నారు.



రాజీనామా చేసిన మండల వైసిపి నాయకులు

సాగునీటి ఎద్దడితో రైతుల ఆందోళన

ప్రజాశక్తి -మామిడికుదురు

నగరంలో గుర్రాల చెరువు ప్రాంతంలో సాగునీరు అందక వరి చేలు ఎండి పోతున్నాయంటూ గురువారం రైతు లు నెర్రలు తీసిన చేలు లో అధికారుల తీరు నిరసిస్తూ ఆందోళన చేశారు. సుమారు 200ఎకరాలకు సాగునీరు అందక పొట్ట దశలో ఉన్న చేలు నెర్రలు తీసి ఎండిపోతున్నాయని వాపోయారు. వంతుల వారీ నీరు అందిస్తా మన్న అధికారులు ఆ విధానాన్ని అమలు చేయడం. లేదన్నారు ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లిన నిర్లక్ష్యం గా వ్యవహరిసున్నారన్నారు. ఇప్పటి వరకు ఎకరాకి రూ.30వేల పెట్టుబడి పెట్టామని రైతు తాటికాయల ఉదయభాస్కర్ తెలిపారు. ఈ ఆందోళన లో రైతు లు కడలి సత్యనారాయణ, బొంతు భాస్కర్రావు, విత్తనాల సుబ్బలక్ష్మి, విత్తనాల సూర్య కాంతం, కూన నరసింహారావు తదితర రైతు లు పాలుగున్నారు.



పొలంలో రైతుల నిరసన

180 మంది కి వైద్య సేవలు

ప్రజాశక్తి -మామిడికుదురు

పెదపట్నంలంక మెయిన్ ప్రాదిమిక పాఠశాల ప్రాంగణంలో నగరం పిహెచ్‌సి వైద్యాధికారి కె. స్వర్ణలత ఆధ్వర్యంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య శిబిరం నిర్వహించారు.

180 మందికి వైద్య సేవలు అందించి వేసవి లో జాగ్రత్తలు పై అవగాహన కల్పించారు. దీర్ఘకాల సమస్యలు ఉన్న రోగుల ఇంటికి వెళ్లి పరీక్షలు నిర్వహించి మందులు తో పాటు సూచనలు ఇచ్చారు.కార్యక్రమం లో హెల్త్ అసిస్టెంట్ ఎస్.సూరిబాబు, ఎఎన్ఎం పి.నాగమణి, ఎంఎల్‌హెచ్ పి.నాగదుర్గ, తదితరులు సేవలు అందించారు.



విలేకరులతో మాట్లాడుతున్న సత్యనారాయణ

'నా ఉపాధికి గండికొట్టొద్దు' చిరుద్యోగి ఆవేదన

ప్రజాశక్తి-మండపేట

తన ఉపాధికి గండి కొట్టి, తన కుటుంబానికి అన్యాయం చేయొద్దని ఇప్పనపాడు గ్రామానికి చెందిన చిరుద్యోగి వీరుళ్ల సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం మండపేటలో విలేకరుల సమావేశంలోఆయన తన గోడు వెళ్లబోసుకున్నాడు. 2022లో తాను తాపేశ్వరం లాకులవద్ద ఒప్పంద పరిధిలో లస్కర్‌గా విధుల్లో చేరానని అన్నారు. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి తన పైఅధికారి జెఇ అజీజ్ ఆయన వ్యక్తిగత పనులకు వాడుకున్నారని అన్నారు. అంతే కాకుండా గడ్డిమందు అమ్మాలని, లాకుల వద్ద ఉన్న కొబ్బరి, అరటి, పనస వంటి ఫలసాయం అమ్మి వచ్చే ఆదాయం అక్కడి జెఇతో పాటు ఇతర సిబ్బంది తమ జేబులో వేసుకొంటున్నారని వాటికి అడ్డుగా వున్నాననే ఉద్దేశ్యంతో తనపై కక్షగట్టి ఉద్యోగం నుంచి తొలగించారన్నాడు. ఈ కారణంగా తాను అయిదు నెలల జీతం కోల్పోయానని అన్నాడు. తాను దళితుడైనందునే తనను ఉద్యోగం నుంచి తప్పించారని ఈ విషయంపై స్పందనలో ఫిర్యాదు చేసినా, లేబర్ అధికారులను, ఉన్నతాధికారులను కలిసినా న్యాయం జరగలేదని కన్నీరు పెట్టుకున్నాడు. నాయకులు, అధికారులు స్పందించి తనకు ఉద్యోగం ఇప్పించి తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.


పూర్తయిన బిటి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-ఆలమూరు

పినపళ్ళలో పుంతలో ముసలమ్మ గుడి నుంచి గొడ్డు కాలువ వరకు సుమారు రెండు కిలోమీటర్లు మేర బిటి రోడ్డును ఒఎన్‌జిసికి చెందిన రూ.58 లక్షల నిధులతో గురువారం పూర్తి చేశారు.

ఈ సందర్భంగా సర్పంచ్ సంగీత సుభాష్ మాట్లాడుతూ రైతులకు అణువుగా ఉండే విధంగా రోడ్డును పునర్నిమించేందుకు సంబంధిత అధికారులను, ప్రజా ప్రతినిధులతో పలుమార్లు చర్చించామన్నారు.రోడ్డు నిర్మాణం పూర్తి కావడంతో వివిధ గ్రామాల రైతులు, గ్రామస్తులు సర్పంచ్ సుభాష్ ను అభినందించారు. రోడ్డు నిర్మాణానికి సహకరించిన ఒఎన్‌జిసి అధికారులకు, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లాకు, ఎంఎల్‌ఎ చిర్ల జగ్గిరెడ్డికి, అధికారులకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు.

కార్టూ'నిజం'





క్విజ్ విజేతలతో ప్రిన్సిపల్ తదితరులు

క్విజ్ విజేతలకు అభినందన

ప్రజాశక్తి-మండపేట

అమలాపురం డివిజన్‌లోని మండపేట, రామచంద్రపురం, రాజోలు, యానం, రావులపాలెం, అమలాపురంలోని నారాయణ స్కూల్ బ్రాంచీల విద్యార్థులకు రామచంద్రపురం నారాయణ స్కూల్ వేదికగా క్విజ్ పోటీల్లో నిర్వహించారు. విజేతలుగా నిలిచిన మండపేట నారాయణ స్కూల్ విద్యార్థులను ప్రిన్సిపల్ శ్రీనివాసు, ఎఒ రామలక్ష్మి అభినందించారు. గురువారం స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన సభలో వారు మాట్లాడుతూ విద్యార్థులలో సజనాత్మక వెలికి తీసేందుకు దోహదపడే క్విజ్ విజ్, సైన్స్ క్విజ్, స్పెల్ బి మన్ వంటి విభాగాలు ఉపయోగపడతాయన్నారు. నారాయణ స్కూల్ ఏజీఎం శ్రీనివాసరెడ్డి విజేతలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మౌలానా సేవలు చిరస్మరణీయం

ప్రజాశక్తి-ముమ్మిడివరం

విద్యాభివద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు చిరస్మరణీయమని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా కొనియాడింది. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక బుద్ధ పార్కు అవరణ లో శరత్ అధ్యక్షతన గురువారం దేశ తొలి విద్యా శాఖా మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ 66వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆర్ పిఐ నాయకుడు పెనుమాల సుధీర్ ముఖ్య అతిథిగా పాల్గొని అంబేద్కర్ మరియు ఆజాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో ఇవివి.సత్యనారాయణ, ఎస్.పథ్వీరాజ్, ఎన్.సూర్య ప్రకాష్, కెఎస్ఎన్.మూర్తి, పండు బాబు, సిహెచ్.శ్రీనివాస్, నరసింహ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఎపి పంచాయతీ రాజ్ విభాగ జోనల్ సెక్రటరీగా బంగారు నాయుడు

ప్రజాశక్తి-మామిడికుదురు

సిఎం జగన్ ఆదేశాల మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగ కమిటీ జోనల్ సెక్రటరీగా మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షులు, పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లి సర్పంచ్ తోలేటి బంగారు నాయుడు నియమితులయ్యారు.

గురువారం తనకు నియామకు ఉత్తర్వులు తాడేపల్లి వైసిపి కేంద్ర కార్యాలయం నుంచి వచ్చాయని బంగారునాయుడు తెలిపారు. అందర్నీ సమన్వయ పరిచి 2024 ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేస్తానని న్నారు. ఈ సంద ర్భంగా సిఎం జగన్‌కు ఆయన ధన్యవాదములు తెలిపారు.



బంగారు నాయుడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-కాట్రేనికోన

కాట్రేనికోన సబ్ స్టేషన్ పరిధిలో 11 కెవి పల్లంకూరు ఫీడర్ 11 కెవి ఆర్‌డబ్ల్యూఎస్ ఫీడర్లలో ఓవర్‌లోడ్ కారణంగా వర్క్ చేయడం, చెట్లు తొలగింపు పనులు చేపట్టడతామని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోకా రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. మండల పరిధిలోని కాట్రేనికోన, వేట్లపాలెం, జికె.పోరా, గద్దెనపల్లి, నడవపల్లి, కొండలేశ్వరం, కొప్పిగుంట, పల్లం, కందికుప్ప, పల్లంకురు, బలుసుతిప్ప, మొల్లేటి మొగ, గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. విద్యుత్ వినియోగదారులందరూ గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

నేరాలు ఘోరాలు

22 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక మెయిన్ రోడ్‌లోని వినియోగంలో లేని బడ్డీకొట్లో అక్రమంగా నిల్వ చేసిన 22 మద్యం సీసాలను జిల్లా టాస్క్ ఫోర్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డిటిసి ఎస్ఐ మహ్మద్ అలీ మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు గురువారం మూతపడ్డ బడ్డి కొట్లో తాళాలు పగలగొట్టి మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. విఆర్ఒ కె.సత్యారావు సమక్షంలో బడ్డీ కొట్టు తాళం తీశామన్నారు. మద్యం సీసీలను ప్రత్తిపాడు ఎక్సైజ్ కార్యాలయానికి తరలించామన్నారు. నిందితులను గుర్తించి కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఆయన వెంట డిటిసి హెచ్‌సి ఇ.ప్రసాద్, కానిస్టేబుల్ నీలిమ, ప్రసాద్, గంగాధర్ ఉన్నారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

మండలంలోని రామరాఘపురం శివారులో నిర్వహిస్తున్న సారా బట్టీపై పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ స్వామినాయుడు మాట్లాడుతూ ముందస్తుగా వచ్చిన సమాచారంతో డిఎస్‌పి హనుమంతరావు పర్యవేక్షణలో ట్రైనింగ్ డిఎస్‌పి కె.ప్రమోద్‌తో కలిసి దాడి చేశామని తెలిపారు. ఈ దాడిలో 300 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బట్టీ నిర్వాహకుడు కొత్త మూలపేటకు చెందిన ముత్తు తాతారావుపై కేసు నమోదు చేశామని తెలిపారు.

నగదు, బంగారం చోరీ

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల మండలం పోతవరం గ్రామ శివారులో జాతీయ రహదారిపై గురువారం ఘరానా దోపిడీ జరిగింది. బాధితులు నల్లజర్ల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం నుంచి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన బంగారు నగల వ్యాపారి గారలి బాలు రూ.5 లక్షల నగదు, మూడున్నర కాసుల బంగారంతో కారులో భీమవరం వెళ్తున్నాడు. నల్లజర్ల మండలం పోతవరం సమీపంలో నలుగురు మరో కారులో వచ్చి పోలీసులమని చెప్పి అడ్డగించారు. వ్యాపారిని వారి కారులో ఎక్కించుకున్నారు. రూ.5 లక్షల నగదు, మూడున్నర కేజీల బంగారు నగలను స్వాధీనం తీసుకున్నారు. వ్యాపారిని రాజమహేంద్ర వరంలోని లాలాచెరువు సమీపంలో వదిలి పరారయ్యారు. దిక్కు తోచని స్థితిలో ఆ నగల వ్యాపారి బొమ్మూరు పోలీసులను ఆశ్రయించాడు. వారు నల్లజర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. నల్లజర్ల పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

స్థానిక కంబాలపాలెం దళితపేటకు చెందిన యువతి(18) ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన గురువారం చోటు చేసుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి సూసైడ్ నోటు రాసి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఆపస్మారక స్థితిలోకి చేరుకుంది. గమనించిన స్థానికులు వెంటనే ఆమెను ఏలేశ్వరం ప్రభుత్వాసుపత్రి తరలించారు. ప్రాథమిక చికిత్స నిర్వహించి మెరుగైన చికిత్స కోసం కాకినాడ తరలించారు. వినోద్ మిస్రా నగర్‌కు చెందిన రవి, తాను ప్రేమించుకున్నానని సూసైడ్ నోట్‌లో పేర్కొంది. బుధవారం రవికుమార్ ఇంట్లో జరిగిన శుభకార్యానికి వెళ్లగా అతని కుటుంబ సభ్యులు తనను నానా దుర్భాషలాడారని పేర్కొంది. మనస్థాపంచెంది ఆత్మహత్యకు పాల్పడుతున్నానని తన చావుకు రవి, అతని కుటుంబ సభ్యులే కారణమని అందులో పేర్కొంది.

సారా, మద్యం విక్రేతల అరెస్టు

ప్రజాశక్తి-కడియం, చాగల్లు, రౌతులపూడి

కడియం మండలంలోని దుళ్ల, జేగురుపాడు శివారు పాములమెట్టలో నాటుసారా అమ్ముతున్న ఇద్దరు మహిళలను అరెస్టు చేసినట్లు కడియం సిఐ బి.తులసీధర్ తెలిపారు. ఒక్కొక్కరి వద్ద నుండి 10 లీటర్ల సారా చొప్పున స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. కేసులు నమోదు చేసి వారిని న్యాయస్థానంలో హాజరు పరిచామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐలు కృష్ణ సాయి, నాగదుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

చాగల్లు మండలం కలవలపల్లిలో అక్రమంగా మద్యం అమ్ముతున్న ఒక మహిళను అరెస్టు చేసినట్టు ఎస్క్మి పి.నాగరాజు తెలిపారు. ఆమె వద్ద నుండి 16 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

రౌతులపూడి మండలంలోని ఎస్.పైడిపాలలో అక్రమంగా మద్యం అమ్మకాలు చేస్తున్న ఒక వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఎస్ఐ చిట్టిబాబు అతని వద్ద నుంచి 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చొప్పెల్లలో వివాహిత హత్య

ప్రజాశక్తి-ఆలమూరు

చొప్పెల్లలో ఒక వివాహిత హత్యకు గురైంది. సిఐ ఎం.రామకుమార్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని చొప్పెల్లకు చెందిన వివాహిత సలాది మరియాకుమారి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిందని ఆమె భర్త పోలీసులకు ఫిర్యాదు ఇచ్చాడు. దీంతో ఎస్ఐ ఎల్.శ్రీనునాయక్ తన సిబ్బందితో కలిసి దర్యాప్తు చేపట్టారు. మరియాకుమారికి బిక్కవోలు మండలం మేళ్లూరుకు చెందిన చల్లా దుర్గా నాగప్రసన్నకుమార్‌తో వివాహేతర సంబంధం ఉందన్నారు. అతడు రెండేళ్లుగా గ్రామంలో తన అక్క బావలకు చెందిన ఇటుకబట్టీని నిర్వహిస్తున్నాడని తెలిపారు. మరియకుమారి, ఆమె భర్త ఇటుకబట్టీలోనే పనిచేసేవారన్నారు. ఈ సమయంలోనే ప్రసన్న కుమార్‌కు మరియకుమారికి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడిందని తెలిపారు. ఇటీవల ఆమె మరో యువకునితో చనువుగా ఉంటుందన్నారు. ఈ విషయమై మరియకుమారి, ప్రసన్నకుమార్ మధ్య వాగ్వాదం చెలరేగిందన్నారు. ఈ సమయంలో ప్రసన్నకుమార్ మరియకుమారిని కోపంతో కొట్టి, గొంతు నొక్కి, ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడుతో గట్టిగా లాగడంతో స్పృహ కోల్పోయి చనిపోయినట్లు నిందితుడు తెలిపినట్లు సిఐ చెప్పారు. నిందితుడు గురువారం తాహశీల్దార్ వద్ద లొంగిపోయాడన్నారు. మరియకుమారి మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు.

టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణపై సమీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

అమరావతి నుంచి టెన్త్, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు నిర్వహణ సన్నద్ధత పై విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఇంటర్మీ డియట్ బోర్డ్ కమిషనర్ సౌరభ్ గౌర్, విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ 26 జిల్లాల కలెక్టర్లు విద్యాశాఖ అధికారులతో జిల్లాల వారీగా గురువారం సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ నందు జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న 2024 మార్చి నెల్లో నిర్వహించ నున్న 10వ తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో అన్ని ముందస్తు ఏర్పాట్లు చేశామని అన్నారు. పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించి పోలీస్ యంత్రాంగం ప్రశ్నాపత్రాల రవాణా భద్రతా అంశాలలో పటిష్టమైన చర్యలు చేపడుతోందన్నారు. అదేవిధంగా విద్యాశాఖ అధికారులు స్క్వాడ్లను నియమిస్తున్నారని అన్నారు. గతంలో కొన్ని పరీక్షా కేంద్రాల్లో జరిగిన సంఘటనను దష్ట్యా వాటి వద్ద భద్రతను మరింత పెంచడం తోపాటు వనర్ బుల్ కేంద్రాలుగా మ్యాపింగ్ చేయడం జరిగిందన్నారు. పరీక్షా కేంద్రాల రూట్లలో ఆర్‌టిసి వారు బస్సు సర్వీసులు నడిపేలా చర్యలు చేప ట్టామన్నారు. పరీక్షా కేంద్రాల్లో కనీస వసతులైన ఫర్నీచర్లు, తాగు నీరు నిరంత రాయంగా విద్యుత్ సరఫరా వంటి వసతుల కల్పనపై దష్టి సారించామన్నారు. పటిష్టమైన ఏర్పాట్ల నడుమ శాంతియుత వాతావరణం లో పదో తరగతి, ఇంటర్ పరీక్షలు నిర్వహిం చేందుకు పక్కాగా ఏర్పాట్లు చేపట్టా మన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.కమల కుమారి, జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారి వి.సోమశేఖర రావు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు పి.గోపాలకృష్ణ, ఎస్‌వి మంగారావు, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎన్.సురేషు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న ఉన్నతాధికారులు

సాగునీరందని వరి చేలు

ప్రజాశక్తి-కాట్రేనికోన



గాజింగితిప్పలో పగులుతీస్తున్న వరిచేలను పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్

మండల పరిధిలోని కందికుప్ప గ్రామపంచాయతీ పరిధిలో గాజింగి తిప్ప వెళ్లే పంట బోదేకు అనుకుని వరిచేలకు సాగు నీరు అందక పోవడంతో వరిచేలుకు సాగునీరు అందక నెర్రలు తీస్తున్నాయని కౌలు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు నెల రోజులుగా సాగు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. నీటిపారుదల శాఖ సిబ్బంది వరి చేల కన్నా ఆక్వా చెరువు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రైతులు సాగు నీటి ఎద్దడి గురించి సిపిఎం నాయకుల దృష్టికి తీసుకురావడంతో ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గాప్రసాద్ గురువారం ఆ ప్రాంతాన్ని సందర్శించి కౌలు రైతులతో మాట్లాడారు. నెర్రలు తీసిన వరి చేలను దిగి పరిశీలించారు. చేను అంతా తిరిగినా కాళ్ళకి చెమ్మ అవ్వలేదని మరో నాలుగు రోజులు ఇలానే ఉంటే వరి చేను ఎందుకు పనికి రాకుండా పోతుందన్నారు. వరి పంటకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఆక్వా చెరువులకు ప్రధాన ఇచ్చి వరి పంటను నాశనం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దాళ్వా వరి పంటకు నీటి విడుదలలో అధిక ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా బోదేలు బాగు చేయించేవిధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు కాలిపే సత్యవతి, చప్పిడి ఏడుకొండలు, కుమార్ తదితరుల పాల్గొన్నారు.


విలసవిల్లిలో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి

దశలవారీగా రోడ్ల అభివృద్ధి

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

విలసవిల్లి సర్పంచ్ గా బాధ్యతలు చేపట్టిన నాటినుండి గ్రామంలో అపరిస్కతంగా ఉన్న అంతర్గత రోడ్లు అన్నింటిని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నట్టు సర్పంచ్ సలాది ఊర్మిళదేవి తెలిపారు. గ్రామంలోని భీమ్ నగర్ ప్రాంతంలో రూ.13 లక్షల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్ల నిర్మాణానికి గురువారం సర్పంచ్ ఊర్మిళదేవి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వైసిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, నాయకులు కోలా ఏసు, అడబాల సురేష్, పుత్సల ఏసు, బళ్ల భాస్కరరావు,చీ కురుమిల్లి ముత్యాలు, బళ్ల పండు, వి.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

చప్పిడివారి సావరంలో 'గడప.. గడపకూ'

ప్రజాశక్తి-రామచంద్రపురం

నియోజకవర్గంలోని చప్పిడి వారిసావరంలో గురువారం గడప..గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి ఇంఛార్జి పిల్లి సూర్యప్రకాష్ స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సిఎం జగన్ చేస్తున్న అభివద్ధి పథకాలు గురించి ప్రజలకి వివరిస్తూ 2024 లో జరిగే ఎన్నికల్లో వైసిపి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట వార్డు కౌన్సిలర్ పోతంశెట్టి శ్యామల గోపాలకష్ణ, పెంటపాటి దేవి శ్రీనివాసరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, వైస్ ఛైర్‌పర్సన్ కొలమూరి శివాజీ, పట్టణ కన్వీనర్ ఉండి సత్తిబాబు, కర్నాల నాగేశ్వరరావు , కవల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


చెరువు నీటిని పరిశీలిస్తున్న కమిషనర్

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-మండపేట

స్థానిక 13వ వార్డులోని పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ బి.రాము సిబ్బందితో గురువారం కలిసి పరిశీలించారు. వార్డులోని ప్రతి వీధి తిరుగుతూ పారిశుధ్య నిర్వహణ ఎలా జరుగుతుందో తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరువులో వ్యర్థాలను వేయకుండా పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాలని సచివాలయ కార్యదర్శులకు సూచించారు. పట్టణ ప్రజలంతా పట్టణ పరిశుభ్రతకు సహకరించాలన్నారు. ఇంటికి వచ్చే పారిశుధ్య కార్మికులకు తడి, పొడి చెత్తను వేరుచేసి అందించాలన్నారు.

'చలో రావులపాలెం' విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

మాదిగల హక్కుల పరిరక్షణకు శుక్రవారం రావులపాలెం శ్రీకృష్ణదేవరాయల కళ్యాణ మండపంలో జరిగే సమావేశానికి అధిక సంఖ్యలో మాదిగలు తరలివచ్చి విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ సమావేశం పిలుపునిచ్చింది. నంగవరంలో ఎమ్ఆర్‌పిఎస్ మండల అధ్యక్షుడు సత్తాల దుర్గారావు అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు.రావులపాలెం సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్ఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కష్ణ మాదిగ విచ్చేస్తున్న సందర్భంగా అధిక సంఖ్యలో మాదిగలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎమ్ఆర్‌పిఎస్ నాయకులు పలివెల రాంబాబు, వంగలపూడి నరసింహమూర్తి, వేపాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన క్వాయర్ యార్న్ శిక్షణ

ప్రజాశక్తి -మామిడికుదురు

కోనసీమ కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో పెదపట్నం లంక లో సాయి లక్ష్మి క్వాయర్ ఇండస్ట్రీ ప్రాంగణంలో క్వాయర్ బోర్డు వారు మహిళకు క్వాయర్ యార్న్ స్పిన్నింగ్ లో శిక్షణ గురువారం ముగిసింది. జిల్లా అధ్యక్షులు వేగి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 20మందికి రెండు నెలల ట్రయినింగ్ ఇచ్చామన్నారు. ఈ శిక్షణ సమయంలో ఒక్కొక్కరికీ నెలకు రూ.3వేల స్టైఫండ్ తో పాటు ట్రైనర్ జీతం ఇచ్చారని తెలిపారు. వీరికి పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. వీరికి డోర్ మ్యాటాస్ ట్రయినింగ్ ప్రోగ్రాం ఇప్పించవలసిందిగా క్వాయర్ బోర్డ్‌ను కోరారు. ట్రయినింగ్ ప్రొగ్రాంకు క్వాయర్ బోర్డ్ నుండి అర్జున్‌ఎం (ట్రయినింగ్ అసిస్టెంట్), రమేష్ రామస్వామి (ఫ్యాకల్టీ)మరియు ట్రయినర్ ఎ.మహా లక్ష్మి, ఇండస్ట్రీ చైర్మన్ వేగి వెంకట సత్యవతి, కోనసీమ కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ చైర్మన్ వేగి వెంకటేశ్వరావు మరియు ట్రయినర్లు పాల్గొన్నారు.

'ప్రధానమంత్రి- జన్మాన్' రెండో దశ అమలుకు 'కోనసీమ'ఎంపిక

ప్రజాశక్తి-అమలాపురం

ప్రధానమంత్రి- జన్మాన్ అమలు 2వ దశలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్, కోనసీమ జిల్లాను ఎంపిక చేశారని జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని నాగ శిరీష పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రధానమంత్రి జన జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ (ప్రధానమంత్రి జన్మాన్) పథక అమలు తీరుపై పై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం అణగారిన కొండ రెడ్లు చెంచులు అభివద్ధిని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. డేటా ఎంట్రీ నిర్దేశిత ప్రొఫార్మాలో చేయాలన్నారు. అవగాహన కల్పించడానికి ఔట్ రీచ్ కార్యక్రమాలు, నిర్వహించాలని సచివాలయ స్థాయిలో వాలంటీర్లు, సంక్షేమ సహాయకులు సహకారంతో డేటా ఎంట్రీ చేయాలన్నారు. మండల స్థాయిలో ఎంపిడిఒ నోడల్ అధికారిగా వ్యవహ రిస్తారన్నారు. పథకాల లబ్ధిని పొందేందుకై ఆయా వర్గాలకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలను తహశీల్దార్లు జారీ చేయాలని, జన్‌ధన్ బ్యాంక్ ఖాతాలు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రారంభించాలని సూచించారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గృహ నిర్మాణ సంస్థ ఆయా వర్గాలకు గహాలు నిర్మించి అందించాలన్నారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన కింద పంచాయితీరాజ్ రూరల్ డెవలప్మెంట్ ఇంజనీర్లు ఆయా తండాలకు రహదారులు నిర్మించాల న్నారు. జాతీయ గ్రామీణ హెల్త్ మిషన్ కింద మొబైల్ మెడికల్ యూనిట్లు మందులతో సహ ఏర్పాటు చేయాలన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులు జారీ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వారిని కోరారు. సమగ్ర శిక్షా కిందగా విద్యాశాఖ విద్యా బోధన చేపట్టాలని కోరారు. గిరిజన ఆవాసాలలో ట్రాన్స్‌కో అధికారులు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలన్నారు. గ్రామీణ త్రాగునీటి సరఫరా పారిశుధ్య విభాగం వారు కమ్యూనిటీ వాటర్ సప్లైని జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి గహానికి అందించాలని ఆమె కోరారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి అన్ని వసతులు కల్పించాలన్నారు.

ఈ యొక్క అభియాన్ ద్వారా వందన్ వికాస కేంద్రాలు నెలకొల్పి ఆయా వర్గాల జీవనోపాదులను గిరిజన సంక్షేమ శాఖ బలోపేతం చేస్తుందన్నారు బహుళ ప్రయోజనాల కేంద్రాలను ఏర్పాటు చేసే ప్రక్రియను గిరిజన సంక్షేమ శాఖ చేప డుతుందన్నారు. గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కార్డులను జిల్లా పౌరసరఫరాల శాఖ జారీ చేసి ఆహార భద్రతను కల్పించాలని అన్నారు. పెట్రోలియం సహజవాయువుల మంత్రిత్వ శాఖ ఉజ్వల యోజన కింద గ్యాస్ కనెక్షన్లు అందించాలన్నారు. సుకన్య సమద్ధి యోజన పీఎం మాతత్వ వందన యోజన కార్యక్రమాలను స్త్రీ సంక్షేమ శాఖ నిర్వహించాలన్నారు ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన కింద సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల గ్రౌండింగ్ కు చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన తండాలలో సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలన్నారు. నైపుణ్య అభివద్ధి సంస్థ ద్వారా నైపుణ్యాలకు బదులు పెట్టి ఆయా వర్గాల జీవనో పాదులను మెరుగుపరచాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 72,297 గిరిజన వర్గాల వారు ఉండగా వారిలో అణగారిన వర్గాలకు చెందిన వారు 560 మంది వరకు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ ఎం.ఝాన్సీ రాణి, డిఆర్‌డిఎ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, డిఎస్ఒ ఎ.పాపారావు, ఎల్‌డిఎం కె.శ్యాంబాబు, డిఎంహెచ్ఒ ఎం.దుర్గారావు దొర, డిఎల్‌డిఒ శాంతి, ఆర్అండ్‌బి పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

'మ్యాజిక్ ఫ్యామిలీ' సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ర్యాలి గ్రామానికి చెందిన శ్యామ్ జాదూగర్ మ్యాజిక్ ఫ్యామిలీ అనూస్ స్వచ్ఛంద సంస్థ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని హైదరాబాద్ కు చెందిన శ్రీ శక్తి గ్రూప్ అధినేత డివి మనోహర్ అన్నారు. సేవా సంబరాలు సందర్భంగా స్థానిక మ్యాజిక్ హౌస్ వద్ద ఫిజియోథెరపీ ఉచిత వైద్య సేవ శిబిరాన్ని ఆయన గురువారం ప్రారంభించారు. వృద్ధులకు కావలసినటువంటి మందులను మరియు ఫిజియోథెరపీ పరికరాలను అందజేశారు. అనంతరం ప్రతి శనివారం ర్యాలి సందర్శకులకు ఉచిత అల్పాహార సేవ చేయుటకు డివి మనోహర్ కుటుంబ సౌజన్యంతో రూ.30 వేలతో నిర్మించిన షెడ్డును మనోహర్, సుజాత దంపతులు కుమారుడు ధర్మిన్‌తో కలిసి ప్రారంభించారు. మ్యాజిక్ ఫ్యామిలీ సభ్యులు శ్యామ్, అన్నపూర్ణ, డాక్టర్ మోహితులు పాల్గొన్నారు

ఫొటోగ్రాఫర్‌పై దాడికి నిరసనగా ధర్నా

ప్రజాశక్తి-రామచంద్రపురం


ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు

అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి కెమెరామెన్‌పై దాడికి నిరసనగా రామచంద్రపురం ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియా విలేకరులు గురువారం ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అదేవిధంగా ఈనాడు కార్యాలయం పై దాడిని నిరసిస్తూ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టు సంఘ నాయకులు కనికెళ్ళ కనక రత్నం, గంపల పధ్వీరాజ్, గుబ్బల రాంబాబు, కె.భద్రరావు, కొప్పిశెట్టి రాము, కుడిపూడి రమేష్, దేవ గణేష్, గవర వెంకటరమణ, దేవు మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రామచంద్రపురం ఆర్‌డిఒ సుధా సాగర్ కు వినతిపత్రం అందజేశారు

జనసేన పార్టీలో చేరికలు

ప్రజాశక్తి - అంబాజీపేట

ఇరుసు మండలం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో శంకర రామదాసు నాయుడు ద్వారా వివిధ సామాజిక వర్గాల వారు, వివిధ పార్టీల వారు గురువారం జనసేన పార్టీలో చేరారు. వారికి జనసేన ఇన్చార్జ్ గిడ్డి సత్యనారాయణ పార్టీ కండువాలు కప్పి సాధారంగా ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రజల శ్రేయస్సు కోసం వైసిపి పాలనను అంతమొందించేందుకు జనసేన టిడిపి కలిసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన అధ్యక్షులు దొమ్మేటి సాయికుమార్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, చిన్నం బాల విజయరావు, వాసంశెట్టి కుమార్, సాధనాల శ్రీనివాస్, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలో 'బాబు ష్యూరిటీ'

ప్రజాశక్తి-మండపేట

పట్టణంలో 16,17,18 వార్డులలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమంలో గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుల జోగేశ్వరరావు, టిడిపి నాయకులు చుండ్రు శ్రీవర ప్రకాష్, పట్టణ అధ్యక్షులు ఉంగరాల రాంబాబు, టిడిపి శ్రేణులతో కలిసి ఎంఎల్ఎ ఇంటింటికీ పర్యటించారు. ప్రతీ ఇంటికి వెళ్లి టిడిపి పవేశ పెట్టనున్న 6 గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ రాజ్ ఇంజినీర్ల ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురం స్థానిక పంచాయతీ రాజ్ ఇంజనీర్ కార్యనిర్వాహక ఇంజనీర్ కార్యాలయ ఆవరణలో గురువారం ఇఇపిఆర్ చంటిబాబు ఆధ్వర్యంలో లంచ్ హౌర్ డెమోన్‌స్ట్రేషన్ నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ స్టేట్ ఆర్గనైజింగ్ కార్యదర్శి అన్యం రాంబాబు మాట్లాడుతూ విజిలెన్సు కేసులను వెంటనే డ్రాప్ చేయాలనీ, 8 ప్రధాన డిమాండ్స్ తో స్టేట్ జెఎసి పిలుపు మేర అన్నీ జిల్లాలలో నిరసన చేబడుతున్నామన్నారు. కార్యక్రమం లో కోనసీమ పి ఆర్ జెఎసి ప్రెసిడెంట్ డిఇఇ శ్రీనివాస్, సెక్రటరీ ఎఇ భద్రరావు దాదాపు 50 మంది ఇంజనీర్స్ పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-ఆలమూరు

మూలస్థానం అగ్రహారంలో ఉన్న షిరిడి సాయిబాబా ఆలయ 17వ వార్షికోత్సవం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. 108 మంది మహిళలు గోదావరి నుండి తీసుకొచ్చిన జలాలతో గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గోదావరి జలాలతో పాటు 40 రకాల పండ్ల రసాలతో బాబాకు అభిషేకం, కలశ పూజ నిర్వహించారు. అలాగే ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ఆదర్శంగా వాలంటీర్ వ్యవస్థ

ప్రజాశక్తి-కడియం

సిఎం వైఎస్.జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థ, అనుబంధంగా వాలంటీర్ సేవా వ్యవస్థను ప్రవేశపెట్టి దేశానికే ఆదర్శంగా నిలిచారని జిల్లా ఇన్చార్జి మంత్రి, వైసిపి రాజమహేంద్రవరం రూరల్ కో ఆర్డినేటర్ చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ అన్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో మంత్రి వేణు పాల్గొన్నారు. వాలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కార అవార్డులను మంత్రి అందజేశారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-నల్లజర్ల

అన్ని శాఖల సమన్వయంతో పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నల్లజర్ల ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారి డాక్టర్ తెల్లం గంగాధరరావు పిలుపునిచ్చారు. గురువారం ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన పల్స్ పోలియో సమన్వయ కమిటీ సమావేశంలో డాక్టర్ గంగాధరరావు మాట్లాడారు. వచ్చే నెల మూడో తేదీన పల్స్ పోలియో కార్యక్రమాన్ని అందరం బాధ్యతాయుతంగా వ్యవహరించి విజయవంతం చేయాలని కోరారు. వైద్య ఆరోగ్యశాఖతో పాటు రెవెన్యూ, విద్య, అంగన్వాడీ శాఖల అధికారులతో సమావేశమైన వైద్యాధికారి డాక్టర్ గంగాధరరావు నల్లజర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై సమీక్ష జరిపారు. ప్రతి గ్రామంలో పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేసే విషయంలో తగిన జాగ్రత్తలు, ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. తహశీల్దారు వర్దనపు కిషోర్ కుమార్ మాట్లాడుతూ, పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం కోసం ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు, అంగన్వాడీ టీచర్లకు ముందస్తు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం కోసం తమ వంతుగా రెవెన్యూ శాఖ తరపున ఎలాంటి సహాయ సహకారాలైనా అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పలివెల ప్రసాద్ మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేస్తామన్నారు. వ్యాక్సిన్‌కు కొరత లేకుండా సరిపడా సిద్ధం చేసుకున్నామన్నారు.

విద్యార్థుల్లో క్రమశిక్షణ మూలం స్కౌట్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్యార్థుల్లో క్రమశిక్షణ, ధైర్య సాహసాలు, సేవా గుణాన్ని అలవర్చేందుకు 'స్కౌట్' ఎంతగానో ఉపయోగపడుతుందని రాజమహేంద్ర వరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. నగరంలోని ఈస్ట్ రైల్వే కాలనీ, న్యూ రామాలయం వద్ద సౌత్ సెంట్రల్ రైల్వే భారత్ స్కౌట్ అండ్ గైడ్స్ ఆధ్వర్యంలో స్కౌట్ ఉద్యమ వ్యవస్థాపకుడు రాబర్ట్ బాడెన్ పావెల్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. పావెల్ విగ్రహానికి ఎంపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్కౌట్ బాయ్స్ గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలైన స్కౌట్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సమాజంలో పోలీసులు ప్రజలకు ఎలా సేవలందిస్తారో, అదే విధంగా విద్యార్థి దశ నుంచి సేవలు అందించేందుకు స్కౌట్ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. తద్వారా సమాజ సేవ, క్రమ శిక్షణ, సేవాతత్పరత అలవడతాయన్నారు. భవిష్యత్తులో ఉత్తమ పౌరులుగా గుర్తింపు పొందుతారని చెప్పారు. రాజమండ్రి రైల్వే స్టేషను అభివృద్ధికి రూ.260 కోట్లను కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసిందన్నారు. తాను ఎంపీగా ఉన్న కాలంలో రాజమండ్రి రైల్వే స్టేషన్లో 4, 5 ప్లాట్ ఫారమ్స్ తీసుకొచ్చామన్నారు. రాజమండ్రి విమానాశ్రయం రూ.355 కోట్లతో ఎలా అభివృద్ధి జరుగుతుందో అదే మాదిరిగా రైల్వే స్టేషన్‌నూ పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న రైల్వే ప్రధాన స్టేషను అయిదు బళ్ల మార్కెట్ వద్దకు మారబోతోందని చెప్పారు. ఈ నెలలోనే ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారని ఎంపీ భరత్ తెలిపారు. మోరంపూడి జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి కానున్నాయని, మరో అయిదారు ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు రాజమండ్రి జాతీయ రహదారిపై నిర్మితం కానున్నాయన్నారు. రానున్న రోజుల్లో నగర ముఖ చిత్రం పూర్తిగా మారబోతోందని ఎంపీ భరత్ తెలిపారు.